క్రీమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలి

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగుల్లో క్రీమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ ఆహిర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రవికుమార్ ముదిరాజ్ కోరారు.

గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయం


గోపాల్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజేందర్ పటేల్ గౌడ్, రాజ్‌కుమార్ విగ్

కాచిగూడ: సుదీర్ఘకాలం హిందూ శ్మశానవాటిక అధ్యక్షుడిగా సేవలందించిన స్వర్గీయ ఎస్.గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయమని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్‌బోర్డు సభ్యులు రాజేందర్ పటేల్ గౌడ్, రాజ్‌కుమార్ విగ్ అన్నారు. బుధవారం హరాస్‌పెంటలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని హాల్‌లో గోపాల్‌రావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయనతో తమకున్న అనుబంధాలను నెమరు వేసుకున్నారు. ఆయన ఆశయాల సాధనకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి గిరిధర్, సి.నందకిషోర్ యాదవ్, డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి


పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ ఉమా

కాచిగూడ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ ఉమా అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం కాచిగూడ స్టేషన్ రోడ్డులో నిర్మిస్తున్న వర్షపు నీటి పైపులైన్ నిర్మాణపు పనులను ఆమె జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పైపులైన్ మ్యాన్‌హోల్ పనులను ఆగిపోవడంతో స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు కృష్ణ కుమార్, శిర్‌సాగర్, సత్యనారాయణ, బి.భీమ్‌రాజ్, సూరి, సంతోష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి


సెంట్రల్ పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎస్.నారాయణరెడ్డి, ఎస్.శరత్ శ్యామ్

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శరత్ శ్యామ్ కోరారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు సెంట్రల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని దేవాలయాలు, మసీద్, చర్చిల మత పెద్దలతో కలిసి సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రార్థన స్థలాల వద్ద నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ ప్రతినిధులు సయ్యద్ ఫరీదుద్దీన్, డాక్టర్ మజార్ ఆహ్మద్, సయ్యద్ ఖలీద్ షా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



చిక్కడపల్లి: ఘంటసాల జయంతిని పురస్కరించుకొని బుధవారం త్యాగరాయ గానసభలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. జోశ్యుల మ్యూజికల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాయకులు పాటలు పాడి అలరించారు. అనంతరం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి గాయనీ గాయకులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ సంస్థ జోశ్యుల రామకృష్ణ, భారతి, రాంద్రోణంరాజు, గరిమెళ్ళ సీత, వెంకట్ రావు, విజయలక్ష్మి, రమాశంకర్, సరస్వతి, రాధిక, అనురాధ, అరుణ, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



ముషీరాబాద్: ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా దేవాలయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు భోలక్‌పూర్‌లోని భవాని శంకర ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈవో జ్యోతి మాట్లాడుతూ... లోక కల్యాణం పూజలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


బస్తీవాసులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు


ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కలిసి వినతిపత్రం అందజేసి సన్మానిస్తున్న వినయ్‌కుమార్, బస్తీవాసులు

గల్లీ లొల్లి.. న్యాయం కోసం ఢిల్లీ వెళ్లి..!

స్వామి వివేకానందనగర్ బస్తీలో ఇళ్లను కూల్చిన అధికారులు
- కోర్టులో కేసు నడుస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించిన వైనం
- ఇంజనీరింగ్ అధికార దుశ్చర్యకు అడ్డుపడ్డ బస్తీవాసులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళనకు దిగిన వైనం
- బస్తీవాసులకు అండగా ఉంటామన్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్


జేసీబీని అడ్డుకుని ఆందోళన చేస్తున్న స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు

చిక్కడపల్లి: గాంధీనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీకి చెందిన 19 దళిత కుటుంబాల ఇళ్లను గత జనవరి 29న రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. బాధితులు తమకు న్యాయం చేయాలని బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అధికారులు తమకు న్యాయం చేయాలని విన్నవించినా పట్టించుకోలేదు. బుధవారం డిప్యూటీ ఇంజినీర్ సన్నీ, ఏఈ సుభాష్ వివేకానందనగర్ బస్తీలో పోలీసులు బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. జేసీబీని స్థానికులు అడ్డుకుని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

70 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నాం..

ఈ సందర్భంగా బాధితులు ఇందు, పద్మావతి, ఎల్లమ్మ, పుజా, సువర్ణ, సంపత్‌కుమార్, వసంత్‌కుమార్, సాయి, రామ్, ఉమేదేవి మాట్లాడుతూ... 70 ఏళ్లుగా ఇక్కడ ఉన్నామని కరెంట్, ట్యాక్స్‌లు చెల్లించామని తెలిపారు. అయినా ఏడాది క్రితం తమ ఇళ్లను ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. సంవత్సరం అవుతున్నా తమకు ఎలాంటి న్యాయం చేయాలేదని వాపోయారు. తమకు ఉండటానికి నిలవ నీడ కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో చోట ఇళ్లు ఇచ్చిన తర్వాత రోడ్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ వెళ్తే అధికారులు బెదిరించారు..

ఇప్పుడు మళ్లీ కోర్టు ఆర్డర్ అని అబద్ధాలు చెబుతూ కూల్చిన చోటే రోడ్లు వేయిస్తామని అధికారులు రావడం సమంజసం కాదన్నారు. బస్తీవాసులు న్యాయం కోసం ఢిల్లీ వెళ్లిన సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి బెదిరించారని తెలిపారు. ఈ విషయాన్ని స్థానికులు ఫోన్ ద్వారా తనకు సమాచారం అందించారని పేర్కొన్నారు. అధికారులు అవినీతి రాజకీయా నేతలకు తొత్తులుగా మారి పేదలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ప్రజల వైపు ఉండి వారికి న్యాయం చేయాలని లేకపోతే తాము న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.


జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ ముఖ్వానకు వినతిపత్రం అందజేస్తున్న ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు

ఢిల్లీలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బస్తీవాసులు..

బస్తీవాసులు కొందరు న్యాయం కోసం మంగళవారమే ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ ముఖ్వానను కలసి వినతిపత్రం కూడా ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గుండుకృష్ణ మాదిగ, ఎల్లయ్యమాదిగ, దశరత్ మాదిగ, కొండపల్లి శివకుమార్‌మాదిగ, నిలయం యాదగిరి మాదిగ, మండే రామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అండగా ఉంటామన్నారు..

స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు ఇళ్లను కూల్చేసి వారికి నిలువ నీడలేకుండా చేశారని వారికి అండగా ఉండాలని జాతీయ ఎస్సీ కమిషన్ ముఖ్వానను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సూచించారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం బస్తీవాసులతో కలసి ఆయన న్యూఢిల్లీలోని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, ఎస్సీ కమిషన్ అధికారులను కలసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ లక్ష్మణ్ నివాసంలో బస్తీవాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అన్యాయంగా ఇళ్లు కోల్పోయిన దళితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని రాజ్యసభ సభ్యులు అన్నారని వినయ్‌కుమార్ తెలిపారు. బస్తీవాసులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివరాలు తెలుకొని న్యాయం జరిగే వరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కోర్టు కేసులు నడుస్తున్నా అన్యాయంగా ఇళ్లు కూల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంధ్య థియేటర్ వద్ద ఉద్రిక్తత

తొక్కిసలాటలో బాలుడికి అస్వస్థత



చిక్కడపల్లి: అల్లు అర్జున్ నటించిన పుష్ప–2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో బుధవారం రాత్రి అభిమానుల తొక్కిసలాటతో ఉద్రిక్తత నెలకొంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన సినీ అభిమానులతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోగా..పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీ చార్జీ చేశారు. దీంతో తొక్కిసలాట జరిగి 11 ఏళ్ల వయసున్న ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్పృహ తప్పిన బాలుడిని వెంటనే ప్రాథమిక చికిత్స చేసి కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘటనలో గాయపడిన మరో బాలుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన పోలీసులు అభిమానులను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించేశారు.

'మాలల సింహ గర్జన' అర్థం లేనిది

నల్లకుంట: ఏ.బీ.సీ.డీ వర్గకరణకు వ్యతిరేకంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో ఇటీవల పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'మాలల సింహ గర్జన'అర్థం లేనిదని బీజేపీ ఎస్సీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్గీకరణతో అన్ని కులాలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మాలలు అడ్డు తగలడం సరైనది కాదన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును ఆమోదిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలు సంతోషం వ్యక్తం చేశారని ఆయన గుర్తుకు చేశారు. కాగా ఇటీవల పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మాలల సింహ గర్జన ద్వారా దళిత సమాజానికి ఏం సందేశాన్ని ఇస్తున్నారని ప్రశ్నించారు. వివేక్ వెంకటస్వామి తన రాజకీయ ప్రయోజనాల కోసం మాల, మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి సింహ గర్జనలు ఎన్ని పెట్టినా ఎస్సీ వర్గీకరణను ఎవరూ ఆపలేరని అన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ జరిగే తీరుతుందని స్పష్టం చేశారు.

ప్రతి బీసీ కుటుంబానికి | రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

ముషీరాబాద్: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు జి.అంజి అధ్యక్షతన బీసీ భవన్‌లో బుధవారం రాష్ట్ర బీసీ యువజన సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి బీసీ కుటుంబానికి రూ.10లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుత ఉన్న 12 కుల ఫెడరేషన్లని కార్పొరేషన్లగా మార్చాలని డిమాండ్ చేశారు. దాదాపు 30 కులాలకు కార్పొరేషన్లు లేవని వాటికి కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్పొరేషన్‌కు చైర్మన్ ఇతర పాలకమండలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ పోస్టులు గతంలో రద్దు చేశారని ఇప్పుడు రుణాలు ఇవ్వడానికి జిల్లా స్థాయి యంత్రాంగం లేదన్నారు. అందుకే ఈడీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు.

◆ గత ప్రభుత్వ పాలనలో తెలంగాణలో ఒక్క బీసీకి కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదన్నారు. 2015లో 3.62 లక్షల దరఖాస్తులు తీసుకుని రుణాలు మంజూరు చేయలేదన్నారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2018లో మరోసారి సబ్సిడీ రుణాలు ఇస్తామని 5.77 లక్షల దరఖాస్తులు తీసుకుని పెండింగ్‌లో పెట్టారన్నారు. 52శాతం జనాభా ఉన్న బీసీల అభివృద్ధికి ఎలాంటి పథకాలు పెట్టలేదన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సతీష్‌కుమార్‌ను నియమించారు. ఈ సమావేశంలో జిల్లాపల్లి అంజి, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, సుధాకర్, నందాగోపాల్, ఉదయ్, రాజేందర్, రఘుపతి, నిఖిల్, ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి వచ్చి | యువ రాజ్యాన్ని స్థాపించాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఉచిత విద్య, వైద్యం అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని.. ఆ దిశగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ యువశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ మొత్తం నేటి యువతదేనని అన్నారు. యువత రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని పిలుపునిచారు. రాజ్యాధికారంలో యువత ఉన్నప్పుడే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. వచ్చే అన్ని ఎన్నికల్లో యువశక్తి పార్టీ టికెట్‌లను యువతకే కేటాయిస్తామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి వచ్చి యువ రాజ్యాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు వి.రాజమల్లయ్య, సెక్రటరీ జనరల్ టి.నరేందర్, జాయింట్ సెక్రటరీ డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ యువశక్తి రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ, గణపతి హోమం

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజా, గణపతి హోమం పూజా కార్యక్రమాలు భక్తిప్రపత్తుల మధ్య నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన అయ్యప్పభక్తుల సమక్షంలో పూజా కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. వీరమణికంఠ సేవా సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంఎన్. శ్రీనివాస్, ఎడ్ల హరియాదవ్, వీరమణికంఠ సేవా సమితి ప్రతినిధులు కోడూరు రాజు, దేవరాజ్, చిరంజీవి గౌడ్, గోపన్న, రాజుస్వామి తదితరులు పాల్గొన్నారు. పూజా అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరమణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో పద్మారావునగర్ పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ప్రతి రోజూ మధ్యాహ్నం అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సమితి ప్రతినిధులు కోడూరు రాజు, దేవరాజ్‌లు చెప్పారు. శ్రీధర్, సాఫ్ట్‌వేర్ శ్రీనివాస్, లింగం, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకురాలు కళావతి మృతి

ముషీరాబాద్: ముషీరాబాద్ గంగపుత్ర సంఘం సీనియర్ నాయకురాలు పూస కళావతి(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, బీఆర్ఎస్ నాయకులు గోరక్‌నాథ్, గంగపుత్ర సంఘం నాయకులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె అంత్యక్రియలు పార్శిగుట్టలోని గంగపుత్ర శ్మశానవాటికలో నిర్వహించారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరేందర్‌యాదవ్

చిక్కడపల్లి: యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం అంతర్జాల వేదికగా విడుదల చేశారు. ఈ మేరకు నియోజకవర్గం నుంచి ఐదుగురు పోటీ చేయగా 154 ఓట్ల ఆధిక్యంలో నరేందర్ యాదవ్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలువురిని మోసగించిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేటకు చెందిన సాయికిరణ్ (34) వెల్లంకి ఓవర్సీస్ కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. కాచిగూడ చెప్పల్‌బజార్‌కు చెందిన సుప్రియ, విష్ణు వద్ద నుంచి రూ.17 లక్షలు తీసుకుని విదేశాలకు పంపకుండా మోసం చేశారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సాయికిరణ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శ్రామికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జార్జియోస్ మావ్రుకోస్

డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి జార్జియోస్ మావ్రుకోస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని డబ్ల్యూఎఫ్‌టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి జార్జియోస్ మావ్రుకోస్ ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాతో సహా ఫ్రాన్స్, జపాన్, జర్మనీ, కొరియా తదితర సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచంలో సంపదను దోచుకుంటున్నాయని అన్నారు. బుధవారం సాయంత్రం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో ''అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్ర.. నేటి పరిస్థితులు''అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జార్జియోస్ మావ్రుకోస్ మాట్లాడుతూ... శ్రామికుల శ్రమశక్తిని కారుచవకగా దోచుకోవడంతోనే ప్రపంచంలో సంక్షోభం పెరిగిందన్నారు. కార్మిక వర్గానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు.

యూనియన్లకు అతీతంగా ఉద్యమించాలి..

ప్రపంచంలోని సమస్త శ్రామికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశంలోని పాలక పార్టీలు కూడా కార్మికుల హక్కులను హరిస్తున్నాయి అన్నారు. పదేళ్లుగా భారత కార్మిక వర్గం సాగిస్తున్న పోరాటాలు కూడా చాలా ఉత్తేజకరంగా ఉన్నాయన్నారు. యూనియన్లకు అతీతంగా భారత కార్మిక వర్గం తమ హక్కుల సాధనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్‌టీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వదేశ్ దేవ్‌రాయ్, ఏఐబీఈఏ కార్యదర్శి బీఎస్ రాంబాబు, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు చుక్కారాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జె. వెంకటేష్, ఏఐటీయూసీ అధ్యక్షులు ఎండీ యూసఫ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, జాతీయ నాయకురాలు విజయలక్ష్మి, ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఓయూ మోడల్ స్కూల్‌పై అధికారుల నిర్లక్ష్యం



ఓయూ మోడల్ స్కూల్ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని మోడల్ స్కూల్ పై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. యూనివర్సిటీ బీఈడీ కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచితాలు లభించడం లేదు. ఇక్కడ చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. గతంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, పండ్లు, గుడ్లు తదితరాలను ఉచితంగా సరఫరా చేశారు. కానీ గత రెండేళ్లుగా ఓయూ అధికారులు పట్టించుకోక పోవడం వలన ఉచితాలు రద్దు అయ్యాయి. వర్సిటీ తరపున స్కూల్‌కు స్పెషల్ ఆఫీసర్ పదవిలో కొనసాగిన ప్రొ.శంకర్ రెండు నెలల క్రితం ఢిల్లీలోని ఎన్ఐఈపీఎస్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. ఇంత వరకు కొత్త స్పెషల్ ఆఫీసర్‌ను నియమించక పోవడంతో మోడల్ స్కూల్ సమస్యలను తీర్చేవారు లేరు. గత వీసీ ప్రొ.రవీందర్ సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నిర్వహణకు ఓయూ మోడల్ స్కూల్‌లో ఆశ్రయం కల్పించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బట్టలు, భోజనం, పండ్లు, గుడ్లు లభిస్తుండటంతో మోడల్ స్కూల్ విద్యార్థులు తమకు కూడ ఉచితాలు లభించాలని ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి లభించు ఉచితాలను అందేల ఓయూ నూతన వీసీ ప్రొ.కుమార్‌ను మోడల్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.